క్లుప్తంగా

దత్తపీఠంలో ఉచిత యోగా శిక్షణ

పటమట(విజయవాడతూర్పు): పటమటలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా నగరంలోని పటమటలో, అయోధ్యనగర్‌లో ఉచిత యోగా శిక్షణ ఇస్తున్నట్లు యోగ సమన్వయకర్త దంతలూరి తిరుపతి రాజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత యోగా శిక్షణ తరగతులు పటమటలోని దత్తపీఠంలో ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 7.30గంటల వరకు, అయోధ్యనగర్‌లోని లోటస్‌ల్యాండ్ మార్క్ ఆకాష్ అపార్టుమెంట్ వద్ద ఉన్న వెల్ఫేర్ హాల్లో ప్రతిరోజు ఉదయం 5.15 నిమిషాల నుంచి 6:30 వరకు, సాయంత్రం 5.00 నుంచి 6.00గంటల వరకు జరుగుతుందని, ఇది ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉచిత యోగా శిక్షణ పొందాలనుకునే వారు 9866041332లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం లేబర్‌కాలనీలోగల గొల్లపల్లి నాగేశ్వర రావు మునిసిపల్ కార్పొరేషన్ (జీఎస్‌ఆర్‌ఎమ్‌సీ) ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నూతన పాఠ్యపుస్తకాలతోపాటు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు గణేష్ పాల్గొని విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. కాగా ప్రోటోకాల్ పేరుతో స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం కార్యదర్శిని పిలవటం, ఆయన పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం పక్షాన కాకుండా ఎమ్మెల్యే వ్యక్తిగతంగా ఆఫీస్ సెక్రటరీగా నియమించుకున్న వ్యక్తి ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనవచ్చా అన్న అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత ప్రసాదాల పంపిణీ పునఃప్రారంభం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఉచిత ప్రసాదాల పంపిణీని శుక్రవారం నుంచి పునఃప్రారంభించారు. ఆలయ ఈవో శీనానాయక్ ప్రసాదాల కౌంటర్ ఎదుట ఉచిత ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్న అనంతరం భక్తులకు ఉచితంగా చిన్న లడ్డూ, పులిహోర, బెల్లం పొంగలిని అందజేస్తామన్నారు. అయితే గత కొంత కాలంగా అమ్మవారి ఆలయం వెలుపల ఉచిత ప్రసాదాలను పంపిణీ చేస్తున్నామని, ఇకపై ప్రతి రోజు స్వామి వారిని దర్శించుకుని బయటకు వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదాలను అందజేయనున్నట్లు చెప్పారు. ఉచిత ప్రసాదాల పంపిణీలో భక్తులు కూడా భాగస్వాములు కావచ్చని, వీలైనంత మొత్తం దేవస్థానికి చెల్లించవచ్చని పేర్కొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు ప్రశంసనీయం: కలెక్టర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్) : పేదరిక నిర్మూలన లక్ష్యంగా పీ4 విధానాన్ని అమలు చేస్తోందని.. ఈ విధానం అమలుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చేయూతనివ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ కోరారు. ఏపీ రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, ఎన్టీఆర్ జిల్లా కొత్త మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.సమరం, వైస్ చైర్మన్ వెలగా జోషి, సభ్యులు శుక్రవారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశను కలిసి మాట్లాడారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలతో పాటు భవిష్యత్తు కార్యాచరణను డాక్టర్ జి. సమరం వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కొత్త కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు ప్రశంసనీయమని, సరైన కార్యాచరణ ద్వారా భవిష్యత్తులో మరింత విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీని జిల్లాలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కొత్త కార్యవర్గం కృషి చేయాలని సూచించారు.

38 మంది మందుబాబులకు జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 38మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 38మందిపై ఐదో ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. 38 మందిని ఆరో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం హాజరుపరచగా, న్యాయమూర్తి లెనిన్‌బాబు 19మందికి ఒక్కొక్కరికి 15వేలు చొప్పున, మిగిలిన 19 మందికి ఒక్కొక్కరికి 10వేలు చొప్పున కలిపి మొత్తం రూ.4,75,000 జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

ఉసూరుమనేలా ఉద్యానవనం

అధ్వానంగా వించిపేట రైల్వే కాలనీ పిల్లల పార్కు

- అడవిని తలపిస్తున్న పార్కు లోపలి భాగాలు
- మచ్చుకైనా కనిపించని ఆహ్లాదం
- శిథిలావస్థకు చేరిన ఆట పరికరాలు



వించిపేట రైల్వే కాలనీలోని చిల్డ్రన్స్ పార్కు



పిచ్చి మొక్కలతో నిండిపోయిన పార్కు



శిథిలావస్థకు చేరుకున్న పిల్లల ఆటపరికరాలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): స్థానిక వించిపేటలోని రైల్వే కాలనీలో చిల్డ్రన్స్ పార్కు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారింది. సాయంత్రం సమయంలో పిల్లలతో కలసి ఆహ్లాదంగా గడిపేందుకు ఏర్పాటు చేసిన ఈ పార్కు నేడు శిథిలావస్థకు చేరుకుంది. రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్యం, ఆహ్లాదం పంచడంతో పాటు పిల్లలకు ఆటవిడుపుగా ఉండేందుకు 2007లో వించిపేట రైల్వే కాలనీలో పచ్చదనం, ఆటపరికరాలు, కూర్చునేందుకు బెంచ్‌లతో సుందరంగా పార్కు నిర్మించారు. దీంతో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సమయంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పిల్లలతో కలసి పార్కులో సేద దీరేవారు. అయితే కాల క్రమేణా ఈ పార్కు నిర్వహణ లేకపోవడంతో ఏపుగా చెట్లు పెరిగిపోవడం, పిల్లల ఆటపరికరాలు శిథిలావస్థకు చేరుకుని కనీసం కూర్చునేందుకు బల్లలు కూడా లేని అధ్వాన స్థితికి చేరాయి.

నిర్వహణలో లోపం..

కాలనీ వాసులకు అందుబాటులో ఉండే విధంగా రైల్వే అధికారులు రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పార్కు నిర్వహణ లోపంతో ఎందుకు పనికి రాకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. పిల్లలకు మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యం కూడా అందించే లక్ష్యంతో రైల్వే అధికారులు వించిపేట రైల్వే కాలనీలో చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేశారు. ఆ సమయంలో రకరకాల ఆటపరికరాలు, తాగునీరు, పూల చెట్లతో పార్కు ఎంతో సుందరంగా తీర్చి దిద్దారు. క్రమేణా వాటి నిర్వహణ లోపించడంతో పార్కులో పిచ్చిమొక్కలు పెరిగి విషపురుగులకు ఆవాసాలుగా మారటం, ఆట పరికరాలు తుప్పు పట్టి పనికిరాకుండా పోయాయి.

పార్కుకు మరమ్మతులు చేపట్టాలి..

కాలనీలోని పిల్లల కోసం ఏర్పాటు చేసిన పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి ఆహ్లాదకర వాతావరణ ఏర్పాటు చేయడంతో పాటు పాడైపోయిన ఆట పరికరాలకు మరమ్మతులు చేపడితే పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తల్లిదండ్రులు చెబుతున్నారు. ముఖ్యంగా దట్టంగా పెరిగిన మొక్కలతో పార్కులో పురుగు, పుట్ర ఉండటంతో పిల్లలను అటుగా పంపించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకుంటుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. రైల్వే అధికారులు దీనిపై దృష్టి పెట్టి పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మునిసిపల్ కార్మికుల సమ్మెకు సంఘీభావం



మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న వెంకట సత్యం

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని మునిసిపాలిటీల్లో మౌలిక వసతులు కల్పించే ఇంజినీరింగ్ కార్మికుల హక్కులను కాపాడాలని, వారికి అందించాల్సిన సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కల్పించాలని వీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యం అన్నారు. ధర్నాచౌక్ వద్ద వీఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుందని, వారికి వేతనాలు కూడా పెంచామని అయితే ఈ కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని, వారి అవసరాలను కనీసం పట్టించుకోవటంలేదన్నారు. ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలం గడుపుతుందని, సమాన పనిని సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులకు కనీస పెన్షన్ సౌకర్యం కల్పించాలని, టెక్నికల్ కార్మికులకు రూ. 29వేలు, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ. 24 వేలు అందించాలని, మున్సిపల్ కార్మికులు 38 రోజుల పాటు దీక్ష చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవటం విచారకరమని అన్నారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని వినతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల హేతుబద్ధీకరణ, బదిలీల విషయంలో ఎటువంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఏపీ గ్రామ/వార్డ్ సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్య ఓ ప్రకటనలో కోరారు. గతంలో (2023–24) మాదిరిగా గ్రామ/వార్డ్‌లను యూనిట్‌గా పరిగణించి ఉద్యోగుల బదిలీలను చేపట్టాలన్నారు. ఒకే జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు, అంతర్ జిల్లాల్లో పని చేస్తున్న భార్యాభర్తలకు పరస్పరం, భాగస్వామ్య బదిలీలకు అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రధానమైన వారిలో సచివాలయ ఉద్యోగులు కూడా ఉన్నారని గుర్తు చేశారు. గ్రామ/వార్డ్ సచివాలయ సంఘం రాష్ట్ర నాయకత్వంతో ప్రభుత్వం చర్చలు జరిపి అందరికీ ఆమోద యోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనం
- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం



సామూహిక కుంకుమార్చనలో భక్తులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గోవింద నామ స్మరణ మధ్య పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. చిట్టినగర్‌లో వేం చేసిన వేంకటేశ్వర స్వామి వారి దేవస్థాన 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో మూడో రోజుకు చేరాయి. మూడో రోజు స్వామి వారి కల్యాణం ఆలయ ప్రాంగణంలోని మండపంలో ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. రంగురంగుల పుష్పాలతో తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై ఇరు దేవేరులతో కొలువుదీరిన స్వామి వారికి తిరుమల తిరుపతి దేవస్థాన వేదవిశ్వ విద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ మురికిపూడి మణిదీప్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రత్నమాచార్యుల పర్యవేక్షణలో శిష్యబృందం కల్యాణతంతును జరిపించారు. సుమారు 300 మంది ఉభయదాతలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య స్వామి వారి కల్యాణ వైభవం అంబరాన్ని తాకింది. స్వామి వారిని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఐపీఎస్ అధికారి సిసోడియా, వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్‌లతో పాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావులు స్వామి వారి ప్రసాదాలు, చిత్రపటాలను వారికి అందించారు.

సామూహిక కుంకుమార్చన..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారికి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కుంకుమార్చనకు పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. అనంతరం యాగశాలలో హోమాలను నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పోతిన ధర్మారావు, మాకిని సత్యనారాయణ, రాంపిళ్ల వాసు, తమ్మిన శ్రీనివాసరావు, కనక సింహాచలం తదితరులు పర్యవేక్షించారు.

నగరాభివృద్ధికి కమ్యూనిస్టుల కృషి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరాభివృద్ధికి కమ్యూనిస్టులు విశేషంగా పాటుపడ్డారని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు అన్నారు. సీపీఐ 53, 37వ డివిజన్ శాఖల రెండో మహాసభ శుక్రవారం వన్‌టౌన్ చేపల మార్కెట్ వద్ద ఉన్న కల్యాణ మండపంలో మాజీ కార్పొరేటర్ కొరగంజి దుర్గాంబ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోటేశ్వరరావు మాట్లాడుతూ జూలై ఏడు, ఎనిమిది తేదీల్లో సీపీఐ విజయవాడ నగర సమితి మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా నగరంలోని 75 సీపీఐ శాఖల మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభల్లో స్థానిక సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. అదేవిధంగా నగర మహాసభల్లో కమ్యూనిస్టు పార్టీ బలోపేతం, నగర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. రానున్న రోజుల్లో ప్రజలను కలుపుకొని స్థానిక సమస్యలపై పోరాడాలని డివిజన్ నాయకులకు సూచించారు. నగర పార్టీ సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, కార్యదర్శివర్గ సభ్యులు కొట్టు రమణారావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ మాట్లాడారు. అనంతరం మహాసభ డివిజన్ పార్టీ కార్యదర్శిగా రాయన గురునాథం, సహాయ కార్యదర్శిగా బియ్యపు భాను తోపాటు తొమ్మిది మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

యోగ సాధనతో మరింత శక్తి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



యోగాసనాలు సాధన చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పరిశ్రమల్లో కార్మికులకు యోగ సాధనతో శారీరకంగా మరింత శక్తి లభిస్తుందని, పనికి ముందు కొంత సమయాన్ని యోగాసనాలకు కేటాయించేలా పారిశ్రామికవేత్తలు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా శుక్రవారం బీఆర్టీఎస్ రోడ్డులోని యోగా స్ట్రీట్‌లో మహిళా పారిశ్రామికవేత్తలతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ యోగాసనాల్లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా 24 రోజులుగా వివిధ వర్గాలను భాగస్వాములను చేసి వారితో ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు జిల్లాలోని అన్ని గ్రామ, మండలాలు, పట్టణాల్లో శిక్షకులతో యోగాసనాలను సాధన చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. రుగ్మతల నుంచి రక్షణ పొందేందుకు యోగాసనాలను ఆచరించడం ఉత్తమ మార్గంగా కార్మికులు ఎంచుకోవాల్సిన అవసరముందన్నారు. మనసును లగ్నం చేసి యోగా శిక్షకుల సూచన మేరకు ఆసనాలు వేస్తే మనసును, శరీరాన్ని ఆధీనంలో ఉంచుకొని దృఢత్వం పొందేందుకు కార్మికులు కృషి చేయాలన్నారు. జూన్ 21 నాటికి ఎన్టీఆర్ జిల్లాలో దాదాపు 10 లక్షల మందికి యోగాసనాలు నేర్పించేందుకు జిల్లా యంత్రాంగం 5 వేల మంది శిక్షకులను ఏర్పాటు చేసిందన్నారు. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎలిప్) కార్యదర్శి కె.కనకదుర్గ, ఫెడరేషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.మురళీకృష్ణ, దళిత్ ఇండియన్ ఇండస్ట్రీస్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కోఆర్డినేటర్ రాజామణి, జేఆర్డీ టాటా అసోసియేషన్ చైర్మన్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ వేసవి శిబిరం




వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, అతిథులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే ఇన్‌స్టిట్యూట్, శాప్ ఆధ్వర్యంలో గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు కాలనీలో 45 రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ వేసవి శిబిరం శుక్రవారంతో ముగిసింది. ముగింపు సమావేశంలో రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ ప్రొడక్షన్ ఇంజినీర్ హనుమానాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వేసవి శిబిరాల ద్వారా విద్యార్థుల్లో క్రీడాసక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. క్యాంపు కోచ్ శ్రీమన్నారాయణరెడ్డి పర్యవేక్షణలో శిక్షణ పొందిన 38 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కొండపై అనధికార కట్టడాలను నిర్మూలించాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రజల క్షేమమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని, కొండపైన ఉన్న అనధికార కట్టడాలను నిర్మూలించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా శుక్రవారం వన్‌టౌన్, పంజా సెంటర్, చిట్టినగర్, కేఎల్‌రావు పార్క్, సీవీఆర్ ఫ్లై ఓవర్, పైపుల రోడ్డు, అజిత్ సింగ్ నగర్ ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కొండపై అనధికార కట్టడాలను నిర్మూలించాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. వీఎంసీ తీసుకుంటున్న చర్యలు తూచా తప్పకుండా పాటించాలని అధికారులను ఆదేశించారు.

సిబ్బందిపై ఆగ్రహం..

వన్‌టౌన్‌లో–బ్రిడ్జి వద్ద కూలిన గోడను చూసి త్వరగా మరమ్మతులు చేయాలని, గోడ నిర్మాణం పూర్తయ్యేలోపు వెంటనే మెష్ వేసి ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అన్నారు. డాక్టర్ కేఎల్ రావు రోడ్, కేఎల్ రావు పార్క్ ప్రాంతాలన్నీ పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో సిబ్బందిపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సీవీఆర్ ఫ్లై ఓవర్ కింద ఉన్న అవుట్ ఫాల్ డ్రెయిన్ పరిశీలించి, అక్కడ చేస్తున్న డీసిల్టింగ్ త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. తొలగించిన సిల్టును ఎప్పటికప్పుడు అక్కడి నుంచి తరలించాలని, అవి కుప్పలుగా రోడ్డుపై లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'డిజీ లక్ష్మి'పై అవగాహన



డిజీలక్ష్మి కిట్‌లు అందిస్తున్న వీఎంసీ యూసీడీ పీవో వెంకట నారాయణ

పటమట(విజయవాడతూర్పు): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా – విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ పి. వెంకట నారాయణ, డిజీ లక్ష్మి పథకంపై కొత్తగా ఎన్నుకున్న వారికి అవగాహన–శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని యూసీడీ విభాగంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కొత్తగా ఎన్నుకున్న డిజీ లక్ష్మిల కోసం కస్టమర్ సర్వీస్ సెంటర్స్ (సీఎస్‌సీ) ఏర్పాటుకు సంబంధించి ఒక్కొక్క ఎస్‌ఎల్‌ఎఫ్(స్లమ్ లెవల్ ఫెడరేషన్) నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేశారని, డిగ్రీ అర్హత ప్రామాణికంగా వీరిని ఎన్నుకున్నారని అన్నారు. ఈ మేరకు వారికి శిక్షణ తరగతులు నిర్వహించి డిజీ లక్ష్మిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని, బయోమెట్రిక్ డివైస్‌ను కూడా అందించడమే కాకుండా ఏవిధంగా ఉపయోగించాలో శిక్షణ ఇచ్చామన్నారు. వీరు ఈ–శ్రమ సర్వే ద్వారా అసంఘటిత కార్మికుల సర్వే చేయనున్నారని తెలిపారు.

డిజీలక్ష్మితో 200 సేవలు..

సీఎస్‌సీల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సర్వీసులు అన్ని దీని ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, సుమారు 200 సర్వీసులు అందుబాటులో ఉంటాయని వెంకటరమణ చెప్పారు. ఈ సర్వీసులను ప్రజలకు చేరువ చేసేందుకు విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో మూడు సర్కిళ్లలో 450 సెంటర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. టెక్నికల్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ ఫణి కుమార్, సుజాత, సి.ఎస్.సి. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్స్ బాజీ షాహీద్, రెడ్డిలత డి.ఆర్.పి ద్రాక్షాయని పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్య కళార్చన



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో చెన్నైకు చెందిన పలువురు కళాకారులు శుక్రవారం తమ నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. చెన్నైలోని శ్రీభరతకళ ఆర్ట్స్ అకాడమీకి చెందిన 25 మంది చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో భక్తులకు తన్మయానికి గురి చేశారు. నృత్యాలయ స్థాపకులు రోజారాణి పర్యవేక్షణలో చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్యప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించి చిన్నారులను అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం రామరాజ్యనగర్ సెక్షన్ 33/11కేవీ హెడ్ వాటర్ వర్క్స్ ఉపకేంద్రం పరిధిలోని 11కేవీ కుమ్మరిపాలెం ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ సీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. రవీంద్రబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు కుమ్మరిపాలెం సెంటర్, రావిచెట్టు సెంటర్ కొండ వైపు, కొట్టేటి కోటయ్య వీధి, గుప్తా సెంటర్, రామమందిరం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సిమెంట్ రోడ్ సెంటర్, పెద్ద సాయిబాబా గుడి తదితర ప్రాంతాల్లో పైన పేర్కొన్న సమయంలో కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

చిట్టినగర్ సెక్షన్ పరిధిలో..

చిట్టినగర్ సెక్షన్ 33/11 కేవీ మిల్క్ ప్రాజెక్ట్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సయ్యద్ అప్పలస్వామి కాలేజి వెనుక వైపు, నాగమ్మ సత్రం, వీజీఎస్ పబ్లిషర్స్, తమ్మిన కృష్ణ వీధి, లంబాడీపేట, సాయిరాం సినిమా హాల్ ఏరియా, కలరా హాస్పటల్ ఏరియా, కుండల మార్కెట్, సౌమ్య సినిమా హాల్ తదితర ఏరియాల్లో కరెంట్ ఉండదని వివరించారు.

భవానీపురం సెక్షన్ పరిధిలో..

భవానీపురం సెక్షన్ పరిధిలోని 11 కేవీ గాంధీ బొమ్మ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులలో భాగంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, గాంధీ బొమ్మ రోడ్, కోళ్లఫారం రోడ్, చర్చి రోడ్, డాల్ఫిన్ బార్ రోడ్, ఐటీసీ పెట్రోల్ బంక్ రోడ్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపి వేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వ్యాపారులతో కుమ్మక్కైన విద్యాశాఖ: పీడీఎస్‌యూ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు నూతన అడ్మిషన్ల ప్రక్రియ ముగించినా అధికారులు పట్టించుకోలేదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ విమర్శించారు. గాంధీనగర్‌లోని పీడీఎస్‌యూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యా ప్రమాణాలు పాటించడం లేదన్నారు. సంపాదనే లక్ష్యంగా విద్యా వ్యాపారానికి పాల్పడుతూ ప్రజల నుంచి అధిక మొత్తంలో డొనేషన్ల పేరుతో ఫీజులను వసూళ్లు చేస్తున్నారన్నారు. పేదల రక్తాన్ని జలగల్లా పీల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ఏఒక్క ప్రైవేట్ విద్యాసంస్థపై అధికారులు చర్యలు తీసుకునే సాహసం చేయలేకపోతున్నారన్నారు. దీని అంతర్యం ఏమిటో విద్యాశాఖ అధికారులే చెప్పాలని డిమాండ్ చేశారు. గాలి వెలుతురు కూడా సరిగాలేని తరగతి గదులు, సౌకర్యాల లేమి ప్రైవేటు విద్యాసంస్థల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అర్హతలు లేని ఉపాధ్యాయులను తక్కువ జీతభత్యాలకు నియమించుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని విద్యాహక్కు చట్టం ప్రకారం నడుచుకోని ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.